ప్రతీ నెల 17వ తేదీ వరకు రేషన్ బియ్యం పంపిణీ

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూలై 16 : ప్రజా పంపిణీ ద్వారా ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం ఇక నుంచి ప్రతీ నెల 17వ తేదీ వరకు అందించే అవకాశం ప్రభుత్వం కల్పించిందని జిల్లా పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ మాచన రఘునందన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పౌరసరఫరాలశాఖ షెడ్యూల్ ప్రకారం 15వ తేదీ వరకే రేషన్ బియ్యం పంపిణీ ఉందన్నారు. అయితే, రేషన్ బియ్యం పంపిణీని ప్రభుత్వం మరో రెండు రోజుల పాటు పొడిగించిందని తెలిపారు. ప్రజలు రేషన్ బియ్యాన్ని ప్రతీనెల 17వ తేదీ వరకు తీసుకోవచ్చని సూచించారు.

ప్రాజెక్టు వివరాలు

ప్రాజెక్టు వ్యయం రూ.956 కోట్లు	రోడ్డు విస్తరణకు సేకరించాల్సిన భూమి 266.55 హెక్టార్లు
భూ సేకరణ వ్యయం రూ.156.80 కోట్లు	ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నది 69.25 హెక్టార్లు
	ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరిస్తున్న భూమి 154.56 హెక్టార్లు

బీజాపూర్ జాతీయ రహదారికి మంచి రోజులు వచ్చాయి. ప్రధానంగా ఈ రహదారి అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు ఇరుకుగా ఉండడం వల్ల నిత్యం అనేక ప్రమాదాలు జరిగి భారీగా ప్రాణనష్టం సంభవించేది. ఈ రహదారి విస్తరణకు ప్రభుత్వం పూనుకున్నా రోడ్డు పక్కనున్న చెట్ల తొలగింపు విషయంలో వివాదం రావడంతో పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు ఈ అవాంతరాలన్నింటికీ ఫుల్‌స్టాప్ పడింది. రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం ఈ రహదారి విస్తరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంది. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్లుగా విస్తరించే పనులు వెంటనే చేపట్టాలని సీఎం ఆదేశించడంతో పనులు చకచకా సాగనున్నాయి. ఈ రోడ్డు విస్తరణ పూర్తయితే అనేక మంది ప్రాణాలు కాపాడినట్టేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.


నాలుగు లేన్లుగా విస్తరించనున్న బీజాపూర్ హైవే

రైట్ రైట్

బీజాపూర్ హైవే విస్తరణ పనులకు తొలగిన అడ్డంకులు

- ఇక శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు
- వెంటనే పనులు చేపట్టాలని సీఎం ఆదేశం
- అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగులేన్లుగా..
- రూ.956 కోట్లతో 46కి.మీ పొడవు విస్తరణ
- భారీ వృక్షాలు, రీప్లాంటేషన్ చేయాలని సర్కార్ నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

నిత్యం రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలతో నరకప్రాయంగా మారిన హైదరాబాద్- బీజాపూర్ హైవే విస్తరణ పనులకు అడ్డంకులన్నీ తొలగిపోయాయి. ఔటర్ రింగు రోడ్డు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46 కి.మీ మేర నాలుగు లేన్ల రహదారి విస్తరణకు సంబంధించి టెండర్ల ప్రక్రియ గతంలోనే పూర్తయిది. కేంద్రం దీన్ని జాతీయ రహదారిగా గుర్తించి హైవే విస్తరణ పనులకు మొత్తం రూ. 956 కోట్ల నిధులు విడుదల చేసిన సంగతి విదితమే. ఇందులో రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనులకు టెండర్‌ను 'మేఘా' ఇన్‌ఫ్రా సంస్థ రూ. 786 కోట్లకు దక్కించుకుని రోడ్డు విస్తరణకు సంబంధించిన పనులు కూడా మొదలు పెట్టింది. అయితే రోడ్డు విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలు తొలగిస్తున్నారంటూ పర్యావరణవేత్తలు ఎన్జీటీని ఆశ్రయించారు. దీంతో ఈ పనులన్నీ ఎక్కడివక్కడే ఆగిపోయాయి. మరోవైపు రోడ్డు నిర్మాణ సంస్థ కొంత నిర్మాణ సామగ్రిని కూడా ఇక్కడ నుంచి తరలించింది. ఇటీవల కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రహదారి విస్తరణ పనులను సీరియస్‌గా తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా తరుచూ ఇదే రహదారిపై తన నియోజకవర్గమైన కొడంగల్‌కు వెళ్లి వస్తుండడంతో అధికారులు ఈ పనుల పురోగతిని ఎప్పటికపుడు సమీక్షిస్తున్నారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి గడ్కరీని కలిసిన తరువాత మళ్లీ ఈ పనుల్లో కదలిక వచ్చింది. కేంద్రం నుంచి అన్ని అనుమతులు రావడంతో పాటు ఎన్జీటీ కేసుల విషయంలో కూడా ఇబ్బందులు తొలిగిపోయాయి. రహదారి విస్తరణలో అడ్డుగా ఉండే భారీ వృక్షాలను తొలగించి వాటిని వేరే ప్రాంతాల్లో రీ ప్లాంటేషన్ చేసేందుకు అంగీకరించింది. ఇటీవల రాష్ట్రంలో కీలకమైన రహదారుల నిర్మాణం, విస్తరణ పనులకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో బీజాపూర్ హైవే పనుల పురోగతిని సమీక్షించారు. అన్ని ఇబ్బందులూ తొలిగిపోయినందున పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణలో తొలగించే భారీ వృక్షాలను రీ ప్లాంటేషన్ చేయాలని సూచించారు. అలాగే దీనిపై మరోసారి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదిలా ఉంటే రోడ్డు విస్తరణలో దాదాపు 9వేల వరకు భారీ వృక్షాలు తొలగిస్తున్నారని, ఇందులో సుమారు వేయి భారీ మర్రి వృక్షాలు ఉన్నాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వృక్షాలన్నీ నిజాం కాలంలో నాటినవని.. వీటిని కాపాడాలంటూ సుమారు 70వేల మంది సంతకాలను సేకరించి ఎన్జీటీని ఆశ్రయించారు. వీటన్నింటినీ రీ ప్లాంటేషన్ చేయాలని ఎన్జీటీ సూచించడంతో ప్రభుత్వం దానికి అంగీకరించింది. ఈ సమస్య తొలగిపోవండంతో హైవే విస్తరణ పనులకు ఇపుడు ఆటంకాలు తొలగిపోయాయి.

266.55 హెక్టార్ల భూ సేకరణ

హైదరాబాద్- బీజాపూర్ హైవే విస్తరణ కోసం అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ చౌరస్తా వరకు మొత్తం 266.55 హెక్టార్లు భూసేకరణ చేయాల్సి ఉంది. ఇందులో 69.75 హెక్టార్లు ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉంది. మిగతా 154.56 హెక్టార్ల భూమిని ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరిస్తున్నారు. ఈ భూసేకరణ కోసం గరిష్ఠంగా రూ. 156.80కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. కొన్నిచోట్ల అటవీ భూములను మినహాయించేందుకు సుమారు రూ. 20.37 కోట్లు అదనంగా ఖర్చు చేస్తున్నారు.

ఏడాదికి 70 మరణాలు

ప్రస్తుతం ఈ రహదారి అత్యంత ప్రమాదరకంగా మారింది. అప్పా నుంచి మన్నెగూడ వరకు వంకర్లు తిరిగి ఇరుకుగా ఉంటుంది. దీంతో ఈ రహదారిలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం సేకరించిన గణాంకాల ప్రకారం ప్రతి ఏటా ఈ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాల్లో 60 నుంచి 70మంది మరణిస్తున్నారు. రాత్రిపూట, తెల్లవారుజామున ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక వీకెండ్‌లో ఈ రహదారి అత్యంత రద్దీగా మారుతోంది. ఈ రహదారికి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఫాంహౌస్‌లు అధికంగా ఉండడంతో శని, ఆదివారం రోజుల్లో వేలాది వాహనాలతో రద్దీగా మారుతోంది. ఒకోసారి గంటల తరబడి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అలా గే సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజవర్గమైన కొండంగల్‌కు ఇదే రూట్‌లో ఎక్కువగా వెళుతుంటారు. దీంతో అధికారులు వీలైనంత త్వరగా ఈ విస్తరణ పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణ పూర్తయితే రంగారెడ్డి జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లా వాసులకు కూడా మేలు జరుగుతుంది. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయి.

18 అండర్‌పాస్‌లు

ఔటర్ రింగురోడ్డు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు వరకు 46 కి.మీ గల ఈ మార్గంలో మొత్తం 18 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఈ హైవే విస్తరణలో భాగంగా చేవెళ్ల, మొయినాబాద్‌ల వద్ద బైపాస్ రోడ్డును నిర్మిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఈ రెండు గ్రామాలు విస్తరించి ఉండడంతో నిర్మాణాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఈ గ్రామాల పక్క నుంచి హైవే బైపాస్ నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఎక్కువగా భూసేకరణ చేయాల్సి వచ్చింది. ఇప్పటికే భూసేకరణ దాదాపు పూర్తయింది. రైతులకు నష్టపరిహారం కూడా దాదాపు అందించారు. చట్ట ప్రకారం ప్రభుత్వ ధరకు మూడింతల పరిహారాన్ని రైతులకు అందిస్తున్నారు.

రైతుల త్యాగాలతోనే అభివృద్ధి

- ధరణి కమిటీ చైర్మన్ కోదండరెడ్డి

కందుకూరు, జూలై 16 : రైతుల త్యాగాలతోనే అభివృద్ధి జరుగుతుందని, కాలుష్య రహిత ఉపాధి కల్పించే పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ధరణి కమిటీ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు, యాచారం మండలాల పరిధిలోని రైతులు పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఇచ్చారని, ప్రతీ రైతుకు ఎకరాకు 121 గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. మంగళవారం కందుకూరు మండలంలోని మీర్కాన్‌పేట, పంజగూడ, తిమ్మాయపల్లి రెవెన్యూలో రైతులకు ఇవ్వనున్న ఇంటి స్థలాలు, భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆర్డీవో సూరజ్‌కుమార్‌తో కలిసి ఆర్డీవో కార్యాలయంలో రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసేకరణలో భాగంగా రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఇప్పటికే భూసేకరణలో భాగంగా రైతులు ప్రభుత్వానికి భూములను అప్పగించారని, అక్కడక్కడా మిగిలిన పట్టా భూములు ఎకరం, అర ఎకరం చొప్పున ఉన్నాయని, రైతులు సేద్యం చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు మాట్లాడారు. మాకు ఉన్న కొద్దిపాటి భూములే బతుకుదెరువని, ఆ భూములను ప్రభుత్వం తీసుకోవద్దని, కొందరు రైతులు.. తప్పని పరిస్థితులుంటే భూమికి భూమిని బదలాయించి హక్కులు కల్పించాలని కోరారు. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ రైతులు త్యాగం చేయనిది ఏ ప్రాజెక్టూ ఈ ప్రాంతానికి రాదని, అభివృద్ధి జరగదని, రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కె.గోపాల్, అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మాజీ జడ్పీటీసీలు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, నాయకులు అందుగుల సత్యనారాయణ, ఎస్.కృష్ణానాయక్, నర్సింహ, చిత్ర సాయిలు. అనేగౌని పాండుగౌడ్, డిల్లీ శ్రీధర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కోదండరెడ్డి

సూచికలేవి?

అండర్‌పాస్‌ల వద్ద నిత్యం ప్రమాదాలు

- కొత్తూరు వద్ద సూచిక బోర్డులు లేక యాక్సిడెంట్లు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపు కరువు
- కనీస చర్యలు తీసుకోని అధికారులు

కొత్తూర్: జూలై 16: డిజైన్ లోపం కారణంగా ప్రమాదకరంగా ఉన్న కొత్తూర్ అండర్‌పాస్ వద్ద ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అండర్‌పాస్ వద్ద సూచికలు ఏర్పాటు చేయక పోవడంతో వాహనచోదకులు తికమకకు గురై ప్రమాదాలకు గురవుతున్నారు. 44వ నెంబర్ జాతీయ రహదారిపై కొత్తూర్ వై జంక్షన్ ఉండడంతో తరుచూ జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఎన్‌హెచ్‌ఏఐ జంక్షన్‌కు సమీపంలో దాదాపు 17కోట్ల రుపాయలు వెచ్చించి అండర్‌పాస్ నిర్మాణం చేపట్టింది. అయితే, అండర్‌పాస్ డిజైన్ లోపం కారణంగా వర్షాకాలంలో వర్షపు నీరు అండర్‌పాస్‌లో నిలిచి పోతుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇటీవల ఓ కారు వర్షపునీటిలో చిక్కుకుంది. అండర్‌పాస్ నిర్మాణం సైతం ఇరుకుగా నిర్మించారు. అండర్‌పాస్‌కు కుడి, ఎడమ వైపు దుకాణాల సముదాయం, వెనుక పక్క కాలనీలు ఉండడంతో అండర్‌పాస్‌కు సరైన భూమి లభించలేదు. దీంతో అధికారులు ఉన్న భూమిలో సరైన డిజైన్ లేకుండా నిర్మించడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కూడా కనిపించకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు కొత్తూర్ మీదుగా షాద్‌నగర్ నియోజకవర్గంతో పాటు, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు అండర్‌పాస్ గుండా వెళ్లాలి. అలాగే కొత్తూర్ నుంచి 44వ జాతీయ రహదారితో పాటు, ఆయా గ్రామాలకు వచ్చి వెళ్లే వాహనాలు కొత్తూర్ అండర్‌పాస్ నుంచి వెళ్లాల్సి ఉంటుంది. వై జంక్షన్ వద్ద ఇటీవల భారీ ప్రమాదం జరుగడడంతో స్థానిక పోలీసులు వై జంక్షన్‌ను భారీకేడ్లతో మూసివేశారు. దాంతో అండర్‌పాస్ రహదారిని పునరుద్ధరించారు. దాంతో మూడు రోడ్ల నుంచి వచ్చిపోయే వాహనాలు అండర్ పాస్ గుండా వెళ్తుండడంతో ట్రాఫిక్ స్తంభిస్తుంది. అలాగే ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో వాహనచోదకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ పోవాల్సి వస్తుంది. అండర్‌పాస్ నిర్మాణం చేపట్టి సంవత్సరం గడుస్తున్నా దానికి అటు, ఇటు ఏటువంటి సూచికలు ఏర్పాటు చేయక పోవడంతో వాహనచోదకులు తికమకకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అండర్‌పాస్‌తో పాటు, అండర్‌పాస్‌ను కలిపే రోడ్ల వద్ద భారీ రేడియం సూచిక బోర్డులు, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.


సూచికలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న కొత్తూర్ అండర్‌పాస్

అద్దె భవనంలో రాణా

- హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీకి సొంత భవనం కరువు
- ఏడు నెలలుగా అద్దె, విద్యుత్ బిల్లు చెల్లించని వైనం!
- దూరభారంతోనూ ఇబ్బందులు పడుతున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు
- అందరికీ అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని వినతి


హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్

యాచారం, జూలై 16 : యాచారం మండలం మేడిపల్లిలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ అద్దె భవనంలో కొనసాగుతోంది. ప్రభుత్వం సొంత భవన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఒకవేళ భవనం నిర్మించాలని భావిస్తే అందరికీ అందుబాటులో ఉండేలా కుర్మిద్దలో పదెకరాల విశాలమైన స్థలం ఉంది. కానీ, అక్కడ సొంత భవనం నిర్మించాలనే విషయంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు చొరవ తీసుకోలేకపోతున్నారు. ఇకపోతే ఏడు నెలలుగా ఇంటి అద్దెను రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు చెల్లించనే లేదు. అద్దె తామే చెల్లిస్తామని గతంలో టీఎస్ఐఐసీ అధికారులు మౌఖికంగా మాత్రమే చెప్పారు. నెలకు రూ.18వేల చొప్పున అద్దె చెల్లించాల్సి ఉందని ఇంటి యజమాని తెలిపాడు. ఈ విషయం రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులకు తెలిసినా అద్దె మాత్రం చెల్లించలేకపోతున్నారు. విద్యుత్ బిల్లు రూ.35,368 చెల్లించాల్సి ఉంది. ఇదిలా ఉంటే, కుర్మిద్దలో ప్రజలకు అనువుగా ఉండాలని ఆరు నెలల క్రితం పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. కేవలం మూడునెలల పాటు అవుట్ పోస్ట్‌లో ఎస్సైతో పాటు నలుగురు సిబ్బంది ఉండేవారు. ఆ తరువాత దానిని మూసేశారు. అక్కడ కూడా అద్దెతో పాటు విద్యుత్ బిల్లు కూడా పెండింగ్‌లో ఉందని సమాచారం.

అయితే, గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం భూములు సేకరించిన గ్రామాల ప్రజల అవసరాలతో పాటు భవిష్యత్తులో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా యాచారం మండలంలోని మేడిపల్లిలో గతేడాది జూన్ 4న హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. కందుకూరు మండలంలోని ఆకులమైలారం, మాలగూడ, పంజాగూడ, మీర్ ఖాన్‌పేట, సాయిరెడ్డిగూడ, ముచ్చర్ల, సార్లరావుల పల్లి, ఉట్లపల్లి, పోతుబండతండా. సార్లపల్లితండా, యాచారం మండలంలోని కుర్మిద్దతండా, కుర్మిద్ద, తాటిపర్తి, మేడిపల్లి, నానక్‌నగర్, గొల్లగూడ, పిల్లిపల్లి గ్రామాలు ఈ స్టేషన్ పరిధిలో ఉన్నాయి. కొంతకాలం ప్రజలకు ఇబ్బందులు రాకుండా కుర్మిద్దలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసి ఓ ఎస్సైని నియమించారు. కొన్ని నెలల పాటు నడిపిన అవుట్ పోస్ట్‌ను ఎత్తివేశారు. అయితే, సాయిరెడ్డిగూడ గ్రామస్తులు మేడిపల్లికి పోవాలంటే 24 కిలోమీటర్ల దూరం, ముచ్చర్ల గ్రామస్తులకు 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. పేద, మధ్యతరగతి ప్రజలు అత్యవసర పని నిమిత్తం వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. కాగా, కుర్మిద్దలోని సర్వే నెంబర్ 207లో ఉన్న పదెకరాల విశాలమైన స్థలంలో పక్కా భవనం నిర్మించాలని గత ఏడాది పోలీస్‌స్టేషన్ ప్రారంభించక ముందు ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని, రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులకు విన్నవించారు. అయితే, వారు పట్టించుకోలేదని ముచ్చర్ల, సాయిరెడ్డి గూడ, ఉట్లపల్లి, మీర్‌ఖాన్‌పేట గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు.

పోలీస్ స్టేషన్‌ను కందుకూరులో ఏర్పాటు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిటీని ఎత్తివేసింది. స్టేషన్‌ను కందుకూరులోనే కొనసాగించాలి. మేడిపల్లి వెళ్లలేక జనం ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం ప్రజలకు అనుకూలంగా కాకుండా.. మేడిపల్లిలో స్టేషన్ ఏర్పాటు చేసింది. మాకు దూరంగా ఉండటంతో పోలీసుల సేవలు అందడం లేదు. త్వరలో సీఎంను కలిసి మా బాధలు విన్నవిస్తాం.

- ఎస్.వెంకట్రాంరెడ్డి, రైతు, సాయిరెడ్డిగూడ

కుర్మిద్దకు తరలించాలి



హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌ను కుర్మిద్దలో ఏర్పాటు చేస్తే అందరికీ అనుకూలంగా ఉంటుంది. రాత్రిపూట ఏదైనా ఘటన జరిగితే పోలీసులు సకాలంలో వస్తారనే నమ్మకం లేదు. రాత్రివేళ మా గ్రామానికి పెట్రోలింగ్ కోసం పోలీసులు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి కుర్మిద్దలో పోలీస్‌స్టేషన్ పెట్టి మా గోడు తీర్చాలి.

- రమేష్, రైతు, ముచ్చర్ల

అద్దెతో పాటు విద్యుత్ బిల్లులు చెల్లించాలి



పోలీస్ అధికారులు ఇంటి అద్దెతో పాటు విద్యుత్ బిల్లు చెల్లించలేదు. కనీసం విద్యుత్ బిల్లు చెల్లించాలని పోలీసులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఏడు నెలల అద్దె నెలకు రూ.10వేల చొప్పున ఇస్తామని, ఆరునెలల తర్వాత పెంచి ఇస్తామని చెప్పారు. కానీ, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

- జగన్, ఇంటి యజమాని, మేడిపల్లి

సీఎం సమావేశంలో కలెక్టర్



సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లాల అభివృద్ధితో పాటు పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ శశాంక హాజరయ్యారు. జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి సమావేశంలో సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

- రంగారెడ్డి అర్బన్, జూలై 16

ఘనంగా మొహర్రం వేడుకలు

నవాబుపేట, జూలై 16 : మొహర్రం వేడుకలను నవాబుపేట, మండల పరిధి గ్రామాల్లో ఘనంగా జరుపుతున్నారు. ఉత్సవాల చివరిరోజు పీర్లను ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. అక్నాపూర్, చింతల్‌పేట, ఎల్లకొండ, ఎక్‌మామిడి గ్రామాల్లో పీర్లకు ప్రతిష్ఠించారు. పీర్ల పండుగతో గ్రామాల్లో సందడి నెలకొంది.

ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చర్యలు

● జిల్లా వైద్య విధాన పరిషత్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్

● పసికందు మృతిపై విచారణ

తాండూరు, జూలై 16: తాండూరులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఆదివారం రాత్రి పసికందు మృతిపై మంగళవారం జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ విచారణ చేశారు. ఆర్ఎంవో, డ్యూటీ వైద్యులు, సిబ్బందిని విచారించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు వైద్యం అందిస్తున్న తీరుపై ఆరా తీశారు. మందుల స్టోరేజీని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం అన్ని మందులు ఉన్నాయని, కొరత లేకుండా ఎప్పటికప్పుడు స్టాక్ పరిశీలించి సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌కు ఇండెంట్ పెట్టాలని, అత్యవసరమైతే కొనుగోలుచేసి రోగులకు ఇవ్వాలని ఆయన ఆదేశించారు.

మురుగు నీటి మళ్లింపునకు చర్యలు

● మాతా శిశు ఆరోగ్య కేంద్రం వద్ద తొలగిన ఇబ్బందులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తాండూరు మాతా శిశు ఆరోగ్య కేంద్రం ద్వారం వద్ద నిలిచిన నీరు



మురుగు నీటి మళ్లింపునకు తవ్విన కాలువ

తాండూరు, జూలై 16 : తాండూరులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రధాన ద్వారం వద్ద మురుగు నీటి నిల్వపై ఈ నెల 13న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, ఆస్పత్రి సూపరిండెంట్ మూర్తి పరిశీలించి మురుగు నీటి మళ్లింపునకు కాలువ తవ్వించారు. కాంట్రాక్టర్ వేసిన సీసీ రోడ్డు ఆస్పత్రి ద్వారం వద్ద వంపుగా ఉండడంతో నీరు నిలుస్తోంది. దీంతో నీటిని తరలించేలా కాలువ తవ్వారు.

క్వాలిఫైడ్ డీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలి



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న డీఎడ్ అభ్యర్థులు

మోమిన్‌పేట్, జూలై 16: 2008 డీఎస్సీలో క్వాలిఫై అయిన ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని అభ్యర్థులు మంగళవారం హైదరాబాద్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లకు వినతి పత్రం ఇచ్చారు. అభ్యర్థులు మాట్లాడుతూ గతంలో 2007, 2009లలో ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు 2008 డీఎస్సీలో అవకాశం ఇచ్చారని తెలిపారు. క్వాలిఫై అయినా ఉద్యోగాలు మాత్రం ఇవ్వకుండా విత్‌హెల్డ్‌లో పెట్టారని పత్రంలో పేర్కొన్నారు. స్పందించిన మంత్రులు క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రఘు, కిషోర్, ప్రవీణ్, రవి,రాంప్రసాద్, వెంకటేశ్, సురేందర్, శ్రీనివాస్, అనూష, మంజుల, లత, కవిత, విజయశ్రీ, శ్రీలత, సునిత, సంధ్య పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు

బొంరాస్‌పేట్, జూలై 16: బొంరాస్‌పేట్, తుంకిమెట్ల గ్రామాల్లోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని దుకాణదారులను ఆదేశించారు.తుంకిమెట్లలో నంది ఫర్టిలైజర్స్, ఆగ్రోస్‌రైతు సేవా కేంద్రం, బొంరాస్‌పేట్ ఆగ్రోస్ కేంద్రాల్లో తనిఖీచేశారు. ఆయన వెంట ఏవో అనురాధ ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్

సాగుపై రైతులకు సలహాలు, సూచనలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు, రైతులు

బొంరాస్‌పేట్, జూలై 16: రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వర్షాకాలం పంటల సాగుపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు ఇచ్చారు. సాగులో రైతులు ఆధునిక విధానాలు పాటించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ తెలిపారు. సమావేశంలో ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏవో అనురాధ, ఏఈవోలు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి పనులను త్వరగా చేయించాలని మంత్రికి వినతి



మంత్రి వెంకట్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న చైర్‌పర్సన్ పావని

ఘట్‌కేసర్, జూలై 16:ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. నగరంలోని నివాసంలో మంత్రిని కలిసి వంతెన సమస్యపై వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి వంతెన నిర్మాణ పనులు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడడంతో పనులకు శ్రీకారం చుట్టారు. మంత్రిని కలిసిన వారిలో ముత్యాలు, రాధాకృష్ణ. నర్సింగరావు ఉన్నారు.

నేటి నుంచి రైల్వేగేట్ మూసివేత

ఘట్‌కేసర్‌లో రైల్వే బ్రిడ్జి పనులు చేస్తున్న కారణంగా కొండాపూర్ రైల్వే గేట్‌ను మూసి ఉంచుతారని చైర్‌పర్సన్‌ముల్లి పావని తెలిపారు. అటు ఇటూ పోయేందుకు ప్రజలు మాధవరెడ్డి వంతెనకిందినుంచి గల రోడ్డుగుండా రాకపోకలు సాగించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పీఆర్ ఈఈగా సత్యనారాయణరెడ్డి

తాండూరు రూరల్, జూలై 16 : పంచాయతీరాజ్ తాండూరు డివిజన్ ఈఈగా సత్యనారాయణరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఈఈ శ్రీరాములు సిద్దిపేటకు బదిలీ అయ్యారు. సిద్ధిపేట ఈఈగా పనిచేసిన సత్యనారాయణరెడ్డి తాండూరు ఈఈగా వచ్చారు. ఈఈ సత్యనారాయణరెడ్డిని డీఈలు వెంకట్‌రావు, కృష్ణ జోషి, సుదర్శన్, జితేందర్, ఏఈవో సంతోష్, సిద్ధార్థ, వంశీ, సురేందర్‌రెడ్డి సత్కరించారు.



ఈఈ సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న డీఈలు, ఏఈలు



పారాయణం చేస్తున్న మహిళలు

శాకాంబరీదేవిగా కట్టమైసమ్మ దర్శనం



తాండూరు, జూలై 16: తాండూరు ఆదర్శనగర్‌లో(పాత కుంట) కట్ట మైసమ్మ మంగళవారం శాకాంబరీ దేవిగా దర్శనమించారు. పండ్లు, కూరగాయాలతో ఆలకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తాండూరు ఆదర్శనగర్, శాంతినగర్, యశోదనగర్, భవానీనగర్, సాయిపూర్ ప్రాంతాల ప్రజలు అమ్మవారికి పూజలు నిర్వహించారు. సాంయత్రం మహిళలు గుడిలో సమగ్రనామపారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్ కౌన్సిలర్ నీరజాబాల్‌రెడ్డి, నిర్వాహకులు రాములు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారెంటీల వర్తింపు

- బీఆర్ఎస్ తెల్లరేషన్ కార్డులివ్వకపోవడం విడ్డూరం
- జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కందుకూరు, జూలై 16: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు అర్హులైన ప్రతీ ఒక్కరికి వర్తింపజేసేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి ఆరోపించారు. మంగళవారం సాయంత్రం మండలంలోని నేదునూరు, బాచుపల్లి గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులతో ఏర్పాటుచేసిన సమావేశాల్లో మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలని నెరవేర్చడానికి కృషి చేస్తున్నారని, రైతు రుణమాఫీ చేయడానికి కార్యచరణ ప్రణాళికలు తయారు చేసినట్లు గుర్తుచేశారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం బాచుపల్లికి చెందిన ఈటమోని బాలమల్లేష్ యాదవ్ తల్లి సత్తమ్మ ఇటీవల మృతిచెందగా.. వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, ఎండీ అఫ్జల్ బేగ్, కృష్ణ, యుగేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నేదునూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న అనితారెడ్డి

పంచాయతీ కార్మికులకు శుభవార్త

- గ్రాంటును విడుదల చేసిన సర్కారు
- వికారాబాద్ జిల్లాకు రూ. 7. 40 కోట్లు విడుదల
- 1113 మంది మల్టీపర్పస్ వర్కర్లకు త్వరలో వేతనాలు

తాండూరు, జూలై16: గ్రామ పంచాయతీలలో పని చేసే మల్టీ పర్పస్ వర్కర్ల పెండింగ్ వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ అండ్ గ్రామీణభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విడుదల చేయబడిన గ్రాంటును వేతనాలు చెల్లింపునకే వాడుకోవాలని ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లాలోని 1,113 మంది మల్టీ పర్పస్ వర్కర్స్ రూ.7.40 కోట్ల ఎస్ఎఫ్‌సీ గ్రాంటును విడుదల చేశారు. వెంటనే గ్రామ పంచాయతీ అకౌంట్‌లోకి ఈ నిధులను జమ చేయాలని డీపీవోలను ఆదేశించారు. మే 2024 వరకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల వారీగా ఈ నిధులను జమ చేసేందుకు జిల్లా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్మికులు కోరుతున్నారు. స్టేట్ మ్యాచింగ్ గ్రాంటు కింద ఈ నిధులను జిల్లాల వారీగా విడుదల చేశారు. ఒక్కోక్క కార్మికుడికి ప్రతినెల రూ. 9500 చెల్లిస్తారు.

ధారూర్ రేంజ్‌కి నలుగురు బీట్ అధికారులు

ధారూరు, జూన్ 16 : ధారూరు అటవీ రేంజ్‌కి కొత్తగా నలుగురు అటవీ బీట్ అధికారులు బదిలీపై వచ్చారు. ధారూర్ బీట్‌కు వీరబాబు, రుద్రారానికి మధుకర్‌రెడ్డి, రాస్నంకు రేణుక, జుంటుపల్లి బీట్‌కు కాశయ్య కొత్త బీట్ అధికారులుగా వచ్చారు. పాత బీట్ అధికారులు వేరే చోట్లకు బదిలీ అయ్యారు. కాగా రేంజ్‌లో 8బీట్లు ఖాళీగా ఉండగా, ధారూరు ఇన్‌చార్జి రేంజర్‌తో కొనసాగుతోంది. కాగా ఈ కౌన్సిలింగ్‌లోనే ధారూరు రేంజ్‌కు సైతం కొత్త రేంజర్‌ను కేటాయించే అవకాశం ఉంది.



వస్తువులను ప్రదర్శిస్తున్న ఎన్సీసీ క్యాడెట్లు

విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలి

శామీర్‌పేట, జులై 16 : విద్యార్థులు, యువత విద్యా అంశాల్లో శిక్షణ, నైపుణ్యాన్ని పొంది ఉత్తమ ప్రతిభావంతులుగా ఎదగాలని ప్రిన్సిపాల్ ఇష్రత్ పిలుపునిచ్చారు. మంగళవారం శామీర్‌పేటలోని జగద్గిరిగుట్ట గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇష్రత్ ఆధ్వర్యంలో ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులు క్రాఫ్ట్, త్రెడ్‌బ్యాగ్స్, నెక్లెస్, పెయింటింగ్, మెహిందీ, హేయిర్ స్టైల్, టెక్నికల్ స్కిల్స్ తదితర నైపుణ్యాలను ప్రదర్శించారు. వీరి నైపుణ్యాలపై ఎన్‌సీసీ క్యాడెట్లు ఇతర విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కో-ఆర్డినేటర్ స్రవంతి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

శామీర్‌పేట, జులై 16 : మున్సిపల్‌లోని ప్రతీ ఒక్కరు ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని తూంకుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ పరిధి పోతాయిపల్లి పార్కులో చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ వెంకటగోపాల్‌ల ఆధ్వర్యంలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. పార్కు స్థలంలో మేనేజర్ శ్రావణ్‌కుమార్, వార్డు కౌన్సిలర్లు, ఆఫీసర్లతో కలిసి మొక్కలను నాటి నీరు పోశారు. చైర్మన్ మాట్లాడుతూ.. ప్రతీ ఇంటి వారు ఆరు మొక్కలను నాటి వృక్షాలుగా ఎదిగేదాక నీరు పోసి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్థలాల్లో మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు హరిబాబు, నర్సింగ్‌రావుగౌడ్, మున్సిపల్ బిల్‌కలెక్టర్లు, జవాన్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొత్తూర్, జూలై 16: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండి, జీవిత లక్ష్యాన్ని చేరుకోవాలని ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు సూచించారు. మండల కేంద్రంలోని మంటోస్సోరి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నూతన చట్టాలపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై జి.శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, పాఠశాల కరస్పాండెంట్ జె.సుదర్శన్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎంపీ అరుణ



పసుల నర్సింహ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ డీకే అరుణ

కేశంపేట, జూలై 16: బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటానని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మండలంలోని కొత్తపేటకు చెందిన బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు పసుల నర్సింహయాదవ్ తల్లి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ మంగళవారం నర్సింహ యాదవ్ కటుంబసభ్యులను పరామర్శించారు. కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎంపీ వెంట బీజేపీ నాయకులు మహేష్, యుగంధర్, గోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాజునాయక్, చౌడం శ్రీనివాస్, పర్వతాలు, శ్రీహరి, భక్తవత్సల్, రాజశేఖర్‌లు ఉన్నారు.

సీఎం సహాయనిధి.. పేదలకు వరం

షాబాద్, జూలై 16 : సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం షాబాద్ మండలం ముద్దెంగూడ గ్రామానికి చెందిన జె.లక్ష్మికి క్యాన్సర్ చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీని అందజేశారు. ఆయన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సన్నపు వసంతం, షాబాద్, చేవెళ్ల మండలాలాధ్యక్షులు కావలి చంద్రశేఖర్, వీరేందర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి చెన్నయ్య, నాయకులు రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, పెంటయ్య, శేఖర్, జానీ, శ్రీనివాస్, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నిన్న కూల్చివేతలు..
నేడు రోడ్డు మూసివేత!

- అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం
- బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాక ఇక్కట్లు



ఘట్‌కేసర్‌లో వాహనాల రాకపోకల కోసం దుకాణాల ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

ఘట్‌కేసర్, జూలై 16 : ఘట్‌కేసర్‌లో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. కమిషనర్, ప్రజాప్రతినిధుల అనాలోచిత చర్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మాణ పనులతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని సోమవారం మున్సిపల్ కమిషనర్ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కలిసి దుకాణాదారులు ఏర్పాటు చేసుకున్న రేకులను, మెట్లను కూల్చి ద్విచక్ర వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించారు. మంగళవారం మధ్యాహ్నం వంతెన పనుల కోసమని తిరిగి రోడ్డును మూసేశారు. తమకు ఒక్క గంటైనా అవకాశం ఇవ్వకుండా రేకులన్నీ ధ్వంసం చేశారని దుకాణదారులు వాపోయారు. ముందు చూపు లేకుండా ఎవరికి తోచిన విధంగా వారు వ్యవహరిస్తుండటంతోనే వంతెన పనులు పూర్తి కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకైనా అవగాహన లేక పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఒక్క రోజు కోసం హడావుడి చేసి తమను నష్టపర్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. అలాగే రోడ్డు వెడల్పు చేసి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. బ్రిడ్జి పనులతో పట్టణంలోకి రాకుండా బైపాస్ గుండా వెళ్తున్న ఆర్టీసీ బస్సులను ఘట్‌కేసర్‌లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బ్రిడ్జి పనుల కోసం మూసివేసిన రోడ్డు

రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణంపై భిన్నాభిప్రాయాలు

- బ్రిడ్జి కట్టాలని కొందరు..
- అండర్ పాస్ నిర్మించాలని మరి కొందరి వాదన
- నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామన్న ప్రజాప్రతినిధులు

తాండూరు, జూలై 16: పాత తాండూరు రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం అభిప్రాయ సేకరణ వివాదాస్పదంగా మారింది. ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు ఒప్పుకోగా మరికొందరు స్థల సేకరణతో నష్టం జరుగుతుందని వ్యతిరేకిస్తున్నారు. మంగళవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాత తాండూరుకు వెళ్లి అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఎవరికీ నష్టం కలగకుండా అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. స్థలాలు, భూములు, నివాసాలు కోల్పోతున్న వారి తరపున కౌన్సిలర్లు ఫ్లై ఓవర్ నిర్మాణం వేయాలని అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. మరికొందరు పనులు చేయాలన్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఫ్లై ఓవర్ పొడువు, వెడల్పులు కుదించాలని కొందరు, మరికొందరు అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలని అన్నారు. నిర్వాసితులకు ప్రభుత్వం పరిహారం ఖరారు చేసిందని అధికారులు ప్రజలకు చెప్పారు. బ్రిడ్జి పనులను నిలిపే అవకాశం లేదని, ప్రజల అభిప్రాయాలను కలెకర్‌కు నివేదిస్తామని మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ స్వప్న, బీఆర్ఎస్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ శోభరాణి, కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్, ఇతర నాయకులు సంపత్‌కుమార్, అబ్దుల్ రవూఫ్, నయీం ఖాన్, హబీబ్ లాలా, జుబెర్ లాల పాల్గొన్నారు.



అభిప్రాయాలను సేకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాదయాత్ర బృందానికి
టీడీపీ నేతల ఘన స్వాగతం

ఆమనగల్లు, జూలై 16: నారా చంద్రబాబు నాయకుడు నాలుగోసారి ఏపీ ముఖ్యమంత్రి పదవిని అధిష్ఠించడాన్ని హర్షిస్తూ మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామానికి చెందిన టీడీపీ మండల ఇన్‌చార్జి ఎల్లమోని యాదయ్యగౌడ్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం ఆమనగల్లు పట్టణానికి చేరుకుంది. ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు సీఎం అయితే.. కర్నూల్ జిల్లా శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేస్తానని మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 14న మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద చేపట్టిన పాదయాత్ర బృందం ఆమనగల్లు కు చేరుకోగా టీడీపీ కల్వకుర్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్, లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. యాదయ్యగౌడ్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. టీడీపీ, చంద్రబాబుకు అనుకూలంగా నినాదాలు చేస్తూ పట్టణంలో పాదయాత్ర కొనసాగింది. తెలుగు రాష్ట్రాల్లో టీడీపీకి పూర్వవైభవం మొదలైందని యాదిలాల్ అన్నారు. టీడీపీ జెండా పేదలకు అండ అని ఆయన చెప్పారు. టీడీపీ పార్లమెంట్ కోశాధికారి అర్థం నర్సింహ, వాణిజ్యసెల్ రాష్ట్ర కార్యదర్శి కండె సత్యనారాయణ, నాయకులు గాజుల పద్మనాభం, కండె భాస్కర్, వజ్రలింగం, కాలె శివ, తదితరులున్నారు. అదేవిధంగా టీడీపీ ఆమనగల్లు మండల అధ్యక్షుడు కొప్పు యాదయ్య, పట్టణ అధ్యక్షుడు గుండమల్ల జగన్‌ల ఆధ్వర్యంలో పాదయాత్ర బృందానికి ఘనంగా స్వాగతం పలికి యాదయ్యగౌడ్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అవ్వారి కిష్టయ్య, జంగయ్యగౌడ్, ఎండీ బాబా షర్ఫోద్దీన్, రహీమ్, దేవేందర్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో యాదయ్యగౌడ్‌కు స్వాగతం పలుకుతున్న అండేకార్ యాదిలాల్

ముదిరాజ్‌ల డిమాండ్లను నెరవేర్చాలి



ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 16: రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన ముదిరాజ్ కులస్థుల డిమాండ్లను నెరవేర్చాలని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు, ఫరూఖ్‌నగర్ మండల తహసీల్దార్‌కు వినతిపత్రాలను ఇచ్చి సమస్యలను చెప్పుకున్నారు. అభయహస్తంలో కాంగ్రెస్ ప్రకటించిన విధంగా బీసీ-డిలో ఉన్న ముదిరాజ్‌ల రిజర్వేషన్లను బీసీ-ఏలోకి మార్చాలని కోరారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్ల నిధులు ఇవ్వాలని, చెరువులు, కుంటలపై సంపూర్ణ హక్కులను కల్పించాలని, మత్స్యకారులకు సబ్సిడీపై రుణాలివ్వాలని కోరారు. ముదిరాజ్ సంఘం నాయకులు మంగ వెంకటేష్, ఆంచ రాములు, అందె పైలయ్య, భూపాల్, డి.రాజు, శ్రీశైలం, బాల్‌రాజ్, రామకృష్ణ, సత్యనారాయణ, మల్లేష్, వెంకటస్వామి, మధు, సురేష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

రూ. వెయ్యి కోట్లతో కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి

కడ్తాల్ : రాష్ట్రంలో ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి ముదిరాజ్‌ల సంక్షేమానికి రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల రాఘవేందర్, శేఖర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల హక్కులకై ముదిరాజ్ లను బీసీ-డీ నుండి బీసీ-ఏ కు మార్చి అమలు చేయాలని వారు కోరారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం మండల ముదిరాజ్ ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ లకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకుముందు ముదిరాజ్ లకు ఇస్తామన్న హామిలను అమలు చేయాలని రూపొందించిన పోస్టర్ ను సంఘం నాయకులతో కలిసి రాఘవేందర్, శేఖర్ లు ఆవిష్కరించారు. అనంతరం వివిద డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ముంతాజ్‌కు అందజేశారు. నాయకులు యాదయ్య, సత్యనారాయణ, శ్రీను, లక్ష్మయ్య, రంగయ్య, రమేశ్, బాలయ్య, జంగయ్య, బుచ్చయ్య, మైసయ్య, అశోక్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అలిజా ఫాతిమా

ఆపన్నహస్తం కోసం
ఎదురుచూపు

- బ్రెయిన్ ట్యూమర్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక
- దాతల ఆర్థిక సాయం కోసం కుటుంబ సభ్యుల వేడుకోలు

చేవెళ్ల, జూలై 16 : బ్రెయిన్ ట్యూమర్‌తో రెండున్నరేళ్ల బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చికిత్స నిమిత్తం దాతలు సహకరించి ఆర్థికసాయం చేయాలని బాలిక కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. మండల కేంద్రంలోని భగత్‌సింగ్ నగర్ కాలనీకి చెందిన మహ్మద్ ఆరిఫ్ కూతురు(రెండున్నరేళ్లు) అలిజా ఫాతిమా కొంత కాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతోంది. హైదరాబాద్‌లోని గ్లేన్‌ఫీల్డ్ మల్లారెడ్డి బ్రెయిన్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నాడు. ఆపరేషన్‌కు రూ.29లక్షల ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో రూ.9లక్షలు చెల్లించాడు. మరో రూ.20 లక్షలు చెల్లించాల్సి ఉందని ఆరిఫ్ తెలిపాడు. ఎవరైనా సాయం చేయాలనుకుంటే.. 8919899983, 9989704383 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని వేడుకుంటున్నాడు.

రాష్ట్రస్థాయి పోటీలకు గట్టిప్పలపల్లి విద్యార్థినులు



విద్యార్థులను సన్మానిస్తున్న రేణురెడ్డి

తలకొండపల్లి, జూలై 16: మండల పరిధిలోని గట్టిప్పలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పూజ, నందిని, సవ్యలు రాష్ట్ర స్థాయి కూచిపూడి పోటీలకు ఎంపికయ్యారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నిర్వహించే సాంస్కృతిక పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు మంగళవారం అభినందన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రేణురెడ్డి ఆధ్వర్యంలో పూజ, నందిన, సవ్యలతో పాటు నృత్య శిక్షకుడు మాస్టర్ శేఖర్‌లను సత్కరించి ప్రోత్సహకంగా రూ.10 వేలు అందజేశారు. నాయకులు ప్రశాంత్ రెడ్డి, శెట్టి రాజశేఖర్, కిషన్, రామచంద్రి, రాములు, నరేందర్, శివ, మల్లేశ్, మశ్చేందర్, రాహుల్, పవన్, శివశంకర్, మల్లేశ్ తదితరులున్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ తోడ్పాటు : ఎంపీ



ఎంపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న క్వీని

ఆమనగల్లు, జూలై 16: రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అన్నివిధాలా తోడ్పాటునందించి ప్రోత్సహిస్తుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి అన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఉచిత శిక్షణ ఇప్పించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా సహకారం అందిస్తుందన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన అంతర్జాతీయ ఫిన్ స్విమ్మర్ గంధం క్వీని విక్టోరియా ఇటీవల ఇంగ్లాండ్ నుంచి ఫ్రాన్స్ వరకు 36 కిలోమీటర్లు స్విమ్ ఎవరెస్ట్‌గా పిలుచుకునే ఇంగ్లీష్ చానల్‌ను ఈది రికార్డు సృష్టించింది. తొలి తెలుగు ఓపెన్ వాటర్ మహిళా స్విమ్మర్‌గా క్వీని రికార్డు నెలకొల్పింది. ఈ నేపథ్యంలో మంగళవారం మల్లు రవిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో క్వీని మర్యాద పూర్వకంగా కలిసింది. క్వీనిని మల్లు రవి అభినందించి సత్కరించారు. ఇంగ్లీష్ చానెల్ ఈది అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు నెలకొల్పడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని ఎంపీ పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్వీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా చేయూతనందించి ప్రోత్సాహం అందేలా చూస్తానని మల్లు రవి హామీ ఇచ్చారు. ప్రతిభ ఆధారంగానే గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. కవులు, కళాకారులు, క్రీడాకారులకు ప్రభుత్వం అన్నివిధాలా తోడ్పాటునందిస్తుందని తెలిపారు.



సర్వేలో భాగంగా పెట్టిన ఎరుపు గుడ్డ

'ఫార్మాసిటీ' రహదారి పనులపై సర్వే

యాచారం, జూలై 16 : ప్రభుత్వం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములకు సంబంధించి రహదారి విస్తరణ పనులపై రెండు రోజులుగా యాచారంలో ఆర్అండ్‌బీ అధికారులు సర్వే చేస్తున్నారు. మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం మండల కేంద్రం వరకు రోడ్డు విస్తరణ కొరకు 78 ఎకరాల భూములు, నందివనపర్తి నుంచి మేడిపల్లి వరకు 33 ఎకరాల భూములు అవసరమని అధికారులు వెల్లడించారు. వంద ఫీట్ల రహదారికి ఆర్అండ్‌బీ అధికారులు మంగళవారం సర్వే చేపట్టారు. నజ్దిక్‌సింగారం నుంచి నందివనపర్తి గ్రామాల మధ్య బైపాస్ రోడ్డు, నందివనపర్తిలో కూడా బైపాస్ రోడ్డు వేసేందుకు సర్వే చేశారు. నందివనపర్తి నుంచి యాచారం మండల కేంద్రం వరకు తిరుమలేషుని గుట్ట వరకు రోడ్డు వేయాలా? యాచారంలో అంబేడ్కర్ విగ్రహం వరకు రోడ్డును విస్తరించాలా? అనే విషయమై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. గతంలో ఈ రెండు రోడ్ల కోసం రూ.126 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. నేడు ఈ నిధులు పెంచాల్సిన అవసరముందని అధికారులు చెప్పారు. భూసేకరణకు భారీగా నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. కాగా, రోడ్డు వేయడానికి భూములు ఇచ్చేది లేదని నజ్దిక్‌సింగారం, నందివనపర్తి, యాచారం గ్రామాల రైతులు విలేకరులతో చెప్పారు. యాచారంలో బైపాస్ రోడ్డు వేస్తే రెండు వెంచర్ల నుంచి వేయాలా లేదా అని అధికారులు సర్వే చేస్తున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నారాయణరెడ్డి

యువత ఉపాధి కల్పనకు కృషి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కడ్తాల్, జూలై 16: కడ్తాలను పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గాన్ని విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయ రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రగతికి బాటలు వేస్తామన్నారు. కడ్తాల మండల కేంద్రంలో నేడు(బుధవారం) రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి పర్యటన నేపథ్యంలో మంగళవారం అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రులచే ప్రారంభించనున్న కేజీబీవీ భవనం, గదులు, ఇతర వసతులను, సభాస్థలిని పరిశీలించి ఎంఈవో సర్దార్ నాయక్, ఎస్‌వో అనితలకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి మంత్రులు కడ్తాలకు వస్తున్నట్లు తెలిపారు. రూ.3.50 కోట్లతో నిర్మించిన కేజీబీవీ భవనం ప్రారంభం అనంతరం జమ్ములబావి తండాలో చెంచు రైతులకు వ్యవసాయ బోరు మోటార్లు పంపిణీ చేస్తారని చెప్పారు. కల్వకుర్తిని వచ్చే రెండేళ్లలో విద్యా హబ్ గా మారుస్తామని చెప్పారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'లను వినియోగించుకోవాలి



చేవెళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది తదితరులు



చౌదరిగూడ : చేగిరెడ్డి ఘణపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు, గ్రామస్తులు



కడ్తాలలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు

● ఐసీడీఎస్ సీడీపీవో, సూపర్‌వైజర్లు
● ఉత్సాహంగా 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట'

చేవెళ్ల, జూలై 16 : అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ చేవెళ్ల సీడీపీవో శోభరాణి తెలిపారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అంగన్‌వాడీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి వారి బంగారు భవిష్యత్‌కు బాట వేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ శ్రీ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఉమారాణి, ప్రవీణ, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని రెండున్నర సంవత్సరాల పిల్లలను గుర్తించి పూర్వపాఠశాల విద్య ప్రాముఖ్యత గురించి తల్లిదండ్రులకు వివరించి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ఈ సందర్భంగా శబరి సూచించారు. ఐసీడీఎస్ సేవలను సూపర్‌వైజర్ శబరి తల్లిదండ్రులకు వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు కె.భాగ్య, జ్ఞానేశ్వరి, యాదమ్మ, మంగమ్మ, ఆయాలు లక్ష్మీబాయి, అలివేలు, శాంతమ్మ, సునీత, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్ : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండలంలోని కడియాలకుంటతండా, బూరుగడ్డ తండా, సూర్యజ్యోతి కాటన్ మిల్ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టీచర్లు శరత్ భాస్కర్, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, నిర్మల, హేమలత తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : 3 నుంచి 6 సంవత్సరాల్లోపు బాలబాలికలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి చిన్నారుల భవిష్యత్‌కు పునాదులు వేయాలని టీచర్లు ప్రమీల, వసంత, సోన, పుష్పలు కోరారు. చేగిరెడ్డి ఘణాపూర్, చింతకుంట తండాల్లో ర్యాలీ చేపట్టారు. ఆయాలు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ రూరల్ : కడియాలకుంట తండాలో ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు తదితరులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ నాయకులు
● మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు మద్దతు

ఆమనగల్లు, జూలై 16: పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ ఆమనగల్లు పట్టణంలో మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు నిరవధిక సమ్మె ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో మహిళా కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ అంతకు ముందు పట్టణంలో ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళ్లకు గంతలు కట్టుకొని సమ్మె చేపట్టారు. సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కమిటీ కన్వీనర్ జె. పెంటయ్య సమ్మెను ప్రారంభించారు. ఆరు నెలల కాలంగా బిల్లులు చెల్లించకపోవడంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని, కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బిల్లులు చెల్లించాలని లేనియెడల పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మిక సంఘం అధ్యక్షురాలు పద్మ, నాయకురాలు సత్యమ్మ, గోజి, యాదమ్మ, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ కడ్తాల మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. కార్మిక సంఘం నాయకురాళ్లు లక్ష్మమ్మ, అలివేలు, అమృత, శారద, వెంకటమ్మ, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండివైఖరి వీడాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు, సకాలంలో వేతనాలు మంజూరు చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం నకు రెండోరోజుకు చేరుకుంది. కార్మికులు శ్రీనివాస్, ప్రభావతి, శంకరమ్మ, అలివేలు, భాగ్యమ్మ, మంజుల, చంద్రకళ, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : పెండింగ్ బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు, సీఐటీయూ మండల కన్వీనర్ బేరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మెస్ చార్జీలు, బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడంతో అప్పులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘం నాయకులు సత్తమ్మ, యాదమ్మ, సబిత, జంగమ్మ, నిర్మల, ఖైరున్, బాలమణి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

మంచాల : కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన రిలేదీక్షలు మంచాల మండలంలో రెండోరోజూ కొనసాగాయి. కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆరు నెలలు గడుస్తున్నా బిల్లులు విడుదల చేయలేదన్నారు. కార్మిక యూనియన్ జిల్లా కోశాధికారి సరిత, అలివేలు, జంగమ్మ, పద్మ, యాదమ్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, పాల్గొన్న బాల్‌రాజ్

యాచారం : మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.పది వేల వేతనమిచ్చి ఆదుకోవాలని, విధిగా వేతనాలందించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.బ్రహ్మయ్య, యాచారం మండల కార్యదర్శి చందూ నాయక్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో రిలే దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుజాత, కళమ్మ, పార్వతమ్మ, బుజ్జమ్మ, మల్లారి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

అక్షయపాత్ర ఫౌండేషన్‌కు మధ్యాహ్న భోజన పథకాన్ని అప్పగించొద్దు

షాద్‌నగర్ : మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర ఫౌండేషన్ నిర్వాహకులకు అప్పగించరాదని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈమేరకు మంగళవారం షాద్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్ అనంద్‌సింగ్‌కు వినతిపత్రం అందజేసింది. సీ ఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎన్.రాజు మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీలకు అక్షయపాత్ర నిర్వాహకులు నాణ్యత లేని భోజనాన్ని సరఫరా చేయడం వల్ల విద్యార్థులు తినిలేకపోవడంతో అక్షయపాత్ర భోజనాన్ని బంద్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తిరిగి రంగారెడ్డి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. ఇదే విధానం అమలవుతే విద్యార్థులు తీవ్ర అస్వస్థకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీల ద్వారానే పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం లభిస్తుందని, మధ్యాహ్న భోజన కార్మికులకే భోజనం అందించేందుకు సర్కారు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీను నాయక్, శ్రీలత, సుమలత, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ : డీటీకి వినతిపత్రమిస్తున్న నాయకులు

ప్రొటోకాల్‌పై మాట్లాడే అర్హత సబితారెడ్డికి లేదు

మహేశ్వరం, జూలై 16 : బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రొటోకాల్ పాటించకుండా నియోజకవర్గంలో అడ్డగోలుగా అనుచరులతో ఆగడాలు చేసిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి.. ఇప్పుడు ప్రొటోకాల్ గురించి మాట్లాడడం ఎంతవరకు సమంజసమని మహేశ్వరం మండల మాజీ ఎంపీపీ కె.రఘుమారెడ్డి, సీనియర్ నాయకులు కూన యాదయ్య మండిపడ్డారు. మంగళవారం మహేశ్వరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఖిల్లామైసమ్మ దేవాలయం వద్ద బోనాల చెక్కుల పంపిణీకి హాజరైన సబితారెడ్డి.. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ హాజరుకావడాన్ని నిరసిస్తూ రాద్ధాంతం చేసిన విషయాన్ని మరిచిపోయి మాట్లాడారన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రొటోకాల్ పాటించకుండా ప్రతిపక్షాలకు, విలువ ఇవ్వకుండా బీఆర్‌ఎస్ నాయకులతో అధికార కార్యక్రమాలు చెలాయించిన సబితారెడ్డి.. ఇప్పుడు ప్రొటోకాల్ గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కేఎల్లార్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కాంగ్రెస్ నాయకుల జోలికొస్తే నియోజకవర్గంలో సబిను అడుగడుగునా అడ్డుకోవాల్సి వస్తుందన్నారు. ఈశ్వర్‌ముదిరాజ్, ఆంగోత్ కృష్ణానాయక్, వత్తుల రఘుపతి, మురళీధర్‌రెడ్డి, రాజునాయక్, లాజర్, పాండునాయక్, నర్సింహ, వెంకటేష్, యాదయ్య, అంద్యానాయక్, ప్రవీణ్, అల్లె కుమార్, జంగయ్య తదితరులున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి

కాంగ్రెస్‌పై సబితారెడ్డిది కక్ష సాధింపు

కందుకూరు : కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కక్షసాధింపు చర్యలు తగవని, ప్రొటోకాల్‌పై ఆర్కేపురంలో తమ నాయకులపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేయడం విడ్డూరంగా ఉందని పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు ఆరోపించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సబితాఇంద్రారెడ్డికి మర్యాదఇవ్వలేదని ఆ పార్టీ నేతలు కాంగ్రెస్ నాయకులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. మాజీ వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, నాయకులు కృష్ణానాయక్, కె.రాణాప్రతాప్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, గణేష్‌నాయక్, బొక్క భూపాల్‌రెడ్డి, డిల్లీ శ్రీధర్, ఎస్‌డి అజీజ్, ఎస్ పాండుకురుమ, అందుగుల సత్యనారాయణ, కె.విఘ్నేశ్వర్‌రెడ్డి, జగన్‌కురుమ, తదితరులున్నారు.



పెంటయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సబితాఇంద్రారెడ్డి

బాధిత కుటుంబానికి సబితాఇంద్రారెడ్డి పరామర్శ

శంకర్‌పల్లి, జూలై 16 : స్థానిక కాంగ్రెస్ నాయకుడు పెంటయ్య కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి పరామర్శించారు. పెంటయ్య మూడు రోజుల రోజులక్రితం గుండెపోటుతో మృతిచెందారు. మంగళవారం సబితారెడ్డి కొండాకల్ గ్రామానికి వెళ్లి పెంటయ్య భార్య శోభమ్మతో పాటు కుమారులు, కూతుళ్లను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పరామర్శించినవారిలో మాజీ జడ్పీటీసీ నారాయణ, సీనియర్ నాయకులు మాణిక్‌రెడ్డి, గోవర్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

అభివృద్ధిలో పాలుపంచుకోవాలి

ఆమనగల్లు, జూలై 16: అభివృద్ధి విషయంలో ప్రజలంతా పాలుపంచుకోవాలని ఎంపీడీవో కుసుమ మాధురి కోరారు. ప్రభుత్వ లక్ష్యాల పూర్తికి పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది చొరవ తీసుకోవాలని సూచించారు. మండల పరిధిలోని ఆకుతోటపల్లిలో మంగళవారం పర్యటించారు. వనమహోత్సవం నర్సరీ, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, క్రీడా ప్రాంగణం, అంతర్గత రోడ్లను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పండ్ల తోటల పెంపకానికి పలువురు రైతుల పొలాల్లో తీసిన గోతులను పరిశీలించారు. పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి వర్షా కాలం నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని కార్యదర్శికి సూచించారు. ఏపీవో మాధవరెడ్డి, కార్యదర్శి, మాజీ సర్పంచ్ రజితశ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు

షాద్‌నగర్ అర్బన్, జూలై 16: సామాజిక సేవా కార్యక్రమాలతోనే లయన్స్ క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు వస్తుందని ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ లయన్ జూలూరి రఘు తెలిపారు. లయన్స్ క్లబ్ షాద్‌నగర్ స్టార్స్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం సోమవారం రాత్రి స్థానిక సాయిరాజా ఫంక్షన్ హాలులో జరిగింది. కార్యక్రమానికి హాజరైన రఘు నూతన కమిటీ అధ్యక్షుడిగా జి.నారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎం. రాంచంద్రయ్య, కోశాధికారిగా మంచిరేవుల అశోక్‌లచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా చైతన్యం, సామాజిక సేవా కార్యక్రమాల కోసమే ఏర్పాటై ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్ గుర్తింపు పొందిందన్నారు. క్లబ్ నాయకులు దండు శరత్‌చంద్రబాబు, ఎం.సాయికృష్ణ, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ నాగవర్ధన్‌రెడ్డి, ఈ. శ్రీనివాస్, జి.పాండురంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, గాదం రమేష్, ఎస్.యాదగిరియాదవ్, ఎం.మురళి తదితరులున్నారు.



లయన్స్‌క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ స్టార్స్ కమిటీ

మహంకాళి బోనాలకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ స్రవంతి

ఇబ్రహీంపట్నం, జూలై 16: వచ్చే ఆదివారం జరుగనున్న శ్రీ మహంకాళి బోనాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి తెలిపారు. మంగళవారం మహంకాళి దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆమె సమావేశమై ఆలయాన్ని సందర్శించారు. ఇబ్రహీంపట్నంలో మొదటగా జరిగే ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తులు హాజరవనున్న నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. కౌన్సిలర్ సుల్తానాబేగం, చైర్మన్ రాంకోశేశ్వర్‌రెడ్డి, ఫెరోజ్, సుబ్రమణ్యంచారి, శేఖర్‌రావు, మహేష్ తదితరులున్నారు.

ఉద్యమ స్ఫూర్తితో అంధత్వ నివారణ కార్యక్రమం

ఆమనగల్లు, జూలై 16: అంధత్వ నివారణ కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకుపోతుందని క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. 65 మందికి పరీక్షలు చేశారు.

షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలి

శంకర్‌పల్లి/షాబాద్/కేశంపేట/శంషాబాద్, జూలై 16: షరతులు లేకుంగా రైతు రుణమాఫీ అమలు చేయాలని శంకర్‌పల్లి బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బీర్ల సురేష్ డిమాండ్ చేశారు. శంకర్‌పల్లిలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలన్నారు. అలాగే రైతు రుణమాఫీ చేయడానికి రేషన్ కార్డు నిబంధన తొలగించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. షాబాద్ మండల కేంద్రంలో రైతువేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు. 2018 కంటే ముందు ఉన్న అప్పులను రుణమాఫీ పరిధిలోని తీసుకురావాలన్నారు. సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, మండలాధ్యక్షుడు దండు యాదవరెడ్డి, కార్యదర్శి దోనూరి కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు. అలాగే రైతు రుణమాఫీకి రేషన్ కార్డు నిబంధన సరికాదని బీఆర్‌ఎస్ నాయకుడు కేశంపేట మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు కర్రెడ్ల నరేందర్‌రెడ్డిలు విమర్శించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడానేజ రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన సరికాదని శంషాబాద్ రైతు సంఘం డైరెక్టర్ రంగారెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అన్నారు.

'పాస్‌బుక్‌ల ఆధారంగానే రైతు రుణాల మాఫీ'

కడ్తాల్/ఆమనగల్లు, జూలై 16 : రైతు రుణాల మాఫీ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా మార్గదర్శకాలు రూపొందించి అమలుకు శ్రీకారం చుట్టిందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. రైతుల రూ.2లక్షల రుణాల మాఫీ విషయంలో సీఎం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారన్నారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టాదారు పాస్‌బుక్‌ల ఆధారంగానే రుణమాఫీ చేస్తుందని తెలిపారు. రేషన్‌కార్డు నిబంధన ఏమీ లేదని కేవలం రైతు కుటుంబాన్ని గుర్తించడానికి మాత్రమేనన్నారు. జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌అలీ, కృష్ణ తదితరులున్నారు. అలాగే రైతు రుణమాఫీ విషయంలో సీఎం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు అప్పం శ్రీను అన్నారు. రూ. 2 లక్షల లోపు రుణమాఫీ విషయంలో అనుమానాలు, అపోహలకు తావులేదని పేర్కొన్నారు. పట్టణంలో చేనేత సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, జేఏసీ కన్వీనర్ శివలింగం లతో కలిసి విలేకరుల సమావేశంలో శ్రీను మాట్లాడుతూ తెల్ల రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా ప్రభుత్వం రుణమాఫీ అమలు చేస్తుందన్నారు.

సంక్షిప్తంగా..

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ జాతీయ రహదారి బైపాస్‌లోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ (ఎఫ్‌సీఎన్) హోమ్‌లోని అనాథలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి అన్నదానం చేశారు. తన పుట్టిన రోజు వేడుకను ఎఫ్‌సీఎన్ హోమ్‌లోని అనాథల మధ్య జరుపుకున్నారు. తిరుపతిరెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

మాడ్గుల : కొల్కులపల్లికి చెందిన శవ పెంటమ్మ(60)అనే ఒంటరి మహిళ మంగళవారం మృతి చెందింది. మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భట్టు కిషన్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి అంత్యక్రియల నిమిత్తం కుటుంబసభ్యులకు రూ.3వేలు అందచేశారు.

తలకొండపల్లి : జంగారెడ్డిపల్లికి చెందిన భాస్కరయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలం గౌడ్, మాజీ జడ్పీటీసీ వెంకటేశ్‌లు పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.3వేలు, వ్యక్తిగతంగా రూ.2వేలు నిర్మలశ్రీశైలంగౌడ్‌లు అందజేశారు.

ఆమనగల్లు : కాలుష్య రహిత సమాజ స్థాపనకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని ఆమనగల్లు విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాసులు, ఏఈ సీతారాములు, విద్యుత్ 1104 యూనియన్ రాజేంద్రనగర్ రీజినల్ సర్కిల్ కార్యదర్శి లక్ష్మీనారాయణలు కోరారు. ఆమనగల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ ఉద్యోగుల 1104 యూనియర్ రాష్ట్ర కార్యదర్శి జి. సాయిబాబా జన్మదినం నేపథ్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

యాచారం : యాచారం మండలంలోని వివిద గ్రామాలలో మంగళవారం ముమ్మరంగా మొక్కలు నాటారు. రోడ్ల వెంట గతంలో తీసిన గుంతలలో ఉపాది కూలీలు మొక్కలు నాటారు. గత రెండు రోజులుగా 15వేల మొక్కలు నాటామని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలో సుమారు లక్షకు పైగా మొక్కలు నాటేందుకు కార్యచరణ రూపొందించామని తెలిపారు. ఆయా గ్రామాలలో యువకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటి వాటి సంరక్షణపై చొరవ తీసుకోవాలని ఎంపీడీవో కోరారు.

కందుకూరు : పులిమామిడికి చెందిన గోపాల్‌దాస్ అంజయ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అంత్యక్రియల నిమిత్తం బీఆర్‌ఎస్ నేత అసోని దామోదర్‌గౌడ్.. మృతుడి భార్య యాదమ్మకు ఆర్థిక సహాయం అందించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయకులు, గ్రామస్తులున్నారు.

శంషాబాద్ రూరల్ : అంబేడ్కర్ అభయ హస్తం పథకం కింద రూ.12 లక్షలు అమలు చేయాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. అర్హులైన నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులకు అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రీతం మాట్లాడుతూ త్వరలోనే ఈ పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సుదర్శన్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

● లైంగిక దాడి అనంతరం హత్యచేసి ఉంటారని పోలీసుల అనుమానం



క్లూస్‌టీంతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ, ఎస్సై రాజ్‌కుమార్ సిబ్బంది

కేశంపేట, జూలై 16: మండల పరిధిలోని వేముల్‌నర్వ గ్రామ శివారు నంబయ్య గుట్ట, వేణుగోపాల స్వామి ఆలయ సమీపంలో మంగళవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాదాపు 45 సంవత్సరాల వయస్సుగల మహిళ ముళ్లపొదల్లో విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. కేశంపేట ఎస్సై రాజ్‌కుమార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా పురుగులుపట్టి గుర్తుపట్టలేని స్థితిలో ఉందని తెలిపారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, రూరల్ సీఐ సత్యనారాయణ మృతదేహాన్ని, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. గుర్తుతెలియని మహిళ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతదేహంపై ఎరుపు రంగు జాకెట్, పచ్చ రంగు(చెక్స్) చీర ఉందని వివరించారు. అయితే, మహిళను గుర్తు తెలియని దుండగులు రేప్‌చేసి హతమార్చినట్లు వారు అనుమానిస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కంటైనర్.. డ్రైవర్‌పై కేసు



శంషాబాద్ రూరల్, జూలై 16: పెద్ద గోల్కొండ గ్రామ పరిధిలోని ఓఆర్‌ఆర్ రోడ్డులో ఓ కంటైనర్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఎస్సై భాస్కర్ తెలిపిన వివరాల మేరకు.. హెచ్‌ఆర్ 38 ఏఈ 9643 నెంబరు గల కంటైనర్ తుక్కుగూడ నుంచి ఓఆర్‌ఆర్ మీదుగా కామారెడ్డి వైపు వెళ్తుండగా డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ వేగంగా ఓఆర్‌ఆర్ ఎడమ వైపు గల డివైడర్‌ను ఢీకొట్టాడు. దాంతో డివైడర్ క్రాష్ బారియర్ ధ్వంసం కావడంతో ఓఆర్‌ఆర్ సిబ్బంది బ్యాగరి రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టగా డ్రైవర్ సూర్యపాల్ మద్యం సేవించినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

ఆదిభట్ల, జూలై 16 : ఉరేసుకొని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధి నాదర్‌గుల్‌లో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఆదిభట్ల ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా, తిరుమలగిరి మండలం, తునికినూతల గ్రామానికి చెందిన వద్యా పద్మ.. భర్త శ్రీనివాస్‌తో కలిసి నగరంలోని బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పద్మ(40) చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు పద్మ కూతురు శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పుస్తెలతాడు అపహరణకు యత్నం

● చైన్‌స్నాచర్లను పట్టుకొని దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

యాచారం, జూలై 16 : ఓ మహిళ మెడలోంచి మూడున్నర తులాల పుస్తెలతాడు అపహరించడానికి యత్నించిన ఇద్దరు దుండగులను గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన యాచారం పంచాయతీ పరిధిలోని మొగ్గుళ్లవంపులో మంగళవారం చోటుచేసుకుంది. మొగ్గుళ్లవంపుకు చెందిన చిప్పలపల్లి రజిత ఒంటరిగా మొగ్గుళ్లవంపు నుంచి చౌదర్‌పల్లివెళ్లే దారిలో ఉన్న తన వ్యవసాయ పొలానికి వెళుతోంది. ఒంటరిగా ఉండడం చూసిన కిషోర్, రమేష్ అనే దుండగులు బైక్‌పై ఆమెను ఫాలో అయ్యారు. అయితే, ఆమె వద్ద ఉన్న మట్టి తీసే పార తమదని, పార ఇవ్వాలని బెదిరించారు. ఇంతలో ఆమె మెడలో ఉన్న మంగళసూత్రం అపహరించే యత్నం చేశారు. రజిత గట్టిగా అరవడంతో చుట్టుపక్కల రైతులు వచ్చి ఆ దుండగులను పట్టుకొని దేహశుద్ధి చేశారు. దుండగులు మంగళసూత్రాన్ని చెట్లపొదల్లో పడేయగా రజిత తీసుకొచ్చి ఇచ్చారు. దొంగలను పోలీసులకు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుదూడలు పట్టివేత

యాచారం, జూలై 16 : ఏపీ నుంచి మహేశ్వరం మండలంలోని తుక్కుగూడకు అక్రమంగా రవాణా చేస్తున్న 9 ఆవుదూడలను సోమవారం రాత్రి యాచారం పోలీసులు పట్టుకున్నారు. దుర్గారావు అనే వ్యక్తి బోలేరోలో ఆవుదూడలను రవాణా తరలిస్తుండగా మండలంలోని గున్గల్ గేటు వద్ద పెట్రోమొబైల్-1 పోలీసులు తనిఖీ చేసి యాచారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మంగళవారం ఉదయం నగరంలోని గోశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట



వాటర్ ట్యాంక్ నిర్మాణం పనులను పరిశీలిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల, జూలై 16 : ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ పనులు సత్వరం పూర్తి చేసేలా కృషి చేస్తున్నామని ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ ఎంపీ పటేల్‌గూడలో 15వ ఫైనాన్స్ నిధులు రూ.50లక్షలతో చేపట్టిన వాటర్ ట్యాంక్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైస్‌చైర్మన్ యాదగిరి, కమిషనర్ బాలకృష్ణలతో కలిసి మంగళవారం పర్యవేక్షించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు అత్యావసరమైన పనులకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ విడతలవారీగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.నూతనంగా చేపట్టిన పనులలో నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు. పటేల్‌గూడలో నీటిసమస్యను తాత్కాలికంగా తీర్చేందుకు రెండు బోర్లు వేయించినట్లు తెలిపారు. వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తయిన వెంటనే మిషన్ భగీరథ నీటిని పైప్‌లైన్ల ద్వారా అందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. డీఈ వెంకన్న, ఏఈ వీరాంజనేయులు నాయకులు ఉదయ్‌పాల్‌రెడ్డి, సురేందర్ గౌడ్, శ్రీనివాస్, జంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, తదితరులున్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

తలకొండపల్లి, జూలై 16 : మొహర్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తలకొండపల్లిలోని వెల్జాలలో మంగళవారం రాత్రి మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. పీర్ల చావిడిని సందర్శించి దట్టీలు సమర్పించారు. బీఆర్‌ఎస్ నాయకులు పరంధాములు, ముజ్జు, శేఖర్, సాయి, యాదయ్య, ఖాజు, శ్రీరామ్, శ్రీకాంత్ తదితరులున్నారు.



పీర్లకు దట్టీలు సమర్పిస్తున్న శ్రీనివాస్‌యాదవ్